www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 23 అక్టోబర్ 2025

5

పశ్చిమ గోదావరి

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

పిహెచ్‌సిలో డిఎంహెచ్‌ఒ తనిఖీ

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

విధుల్లో సిబ్బంది అలసత్వం వహిస్తే సహించబోనని డిఎంహెచ్‌ఒ గీతాబాయి తెలిపారు. లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జి.గీతాబాయి బుధవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది విధుల్లో ఉన్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. విధుల్లో ఉన్న స్టాఫ్ నర్స్ ముత్యవల్లిని రాత్రి సయంలో ఏయే కేసులు వస్తున్నాయి, వైద్య సేవలు ఎలా అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు స్ట్రైక్‌లో ఉన్న కారణంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందరికీ అందేటట్లు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అలాగే రాత్రి వేళ తప్పకుండా విధుల్లో ఉండాలని, ఆ సమయంలో డెలివరీ కేసులు, పాముకాటు, యాక్సిడెంట్ కేసులు గాని వస్తే వెంటనే వైద్య సహాయం అందించాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అన్నదాత 'వర్రీ'..!

- అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో పెనుమార్పు
- డెల్టాలో అత్యధిక భాగం పొట్ట, ఈనిక దశలో పంట
- మెట్ట ప్రాంతంలో కోత దశకు చేరిన వరి పంట
- భారీ వర్షాలు కురిస్తే తీవ్ర నష్టమంటున్న అన్నదాత
- రెండు జిల్లాల్లో దాదాపు 4 లక్షల ఎకరాల్లో వరిసాగు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అల్పపీడన ప్రభావంతో బుధవారం ఉదయం నుంచి వాతావరణంలో పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. మబ్బులు, వర్షాలతో ఖరీఫ్ సాగుపై తీవ్ర ఆందోళన నెలకొంది. ఖరీఫ్‌లో పశ్చిమలో 2.05 లక్షలు, ఏలూరు జిల్లాలో లక్షా 95 వేల ఎకరాలు రెండు జిల్లాల్లో మొత్తంగా నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ఎన్నో వ్యయప్రయాసలు అనంతరం పంట చివరి దశకు చేరింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఒక్కసారిగా వాతావరం మారిపోయింది. అల్పపీడనం వాయుగుండంగా మారనున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తోంది. దీంతో ఖరీఫ్ సాగు పరిస్థితి ఏమిటనే బెంగ అన్నదాతను వెంటాడుతోంది. ఈ నెల 27వ తేదీ నుంచి ధాన్యం కొనుగోలు ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఏలూరు జిల్లాలోని ఉంగుటూరు, భీమడోలు వంటి మండలాలతోపాటు పశ్చిమలోని తాడేపల్లిగూడెం, పెంటపాడు వంటి పలు మండలాల్లో వరి కోత దశకు చేరింది. డెల్టాలోని పలు ప్రాంతాల్లో పంటంతా పొట్ట, ఈనిక దశలో ఉంది. ఈ తరుణంలో వర్షాలు కురిస్తే దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే పరిస్థితి ఏర్పడనుంది. ఈనిక దశలో వర్షాలు కురిస్తే కంకులకు ఉన్న సొంపు రాలిపోయి తాలు గింజలు ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉంది. అదే జరిగితే దిగుబడిపై తీవ్ర ప్రభావం పడనుంది. కోత దశకు చేరిన పంట నేలకొరిగితే రైతులు మాసూలు చేసేందుకు నానా యాతన పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికే రైతులు ఎకరాకు రూ.30 వేల వరకూ పెట్టుబడులు పెట్టారు. ఎరువులు, పురుగు మందులకు పెద్దఎత్తున ఖర్చు పెట్టారు. ఈ తరుణంలో వర్షాలు కురిస్తే రైతులకు మరింత ఖర్చులు పెరిగిపోగా, పంట చేతికి రావడం కష్టంగా మారుతోంది. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి రానుంది. ముఖ్యంగా డెల్టా ప్రాంతంలో ఆధునికీకరణ లేక పంట కాలువలన్నీ మెరకదేరిపోయాయి. భారీ వర్షాలు కురిస్తే వరద నీటికి పంట పొలాలు నీట మునిగే ప్రమాదం ఉంది. దీంతో పంట నష్టం తీవ్రత పెరగనుంది. పంట చివరిదశలో వాయుగుండం వంటి హెచ్చరికలతో రైతులు లోలోన గుబులు చెందుతున్నారు. మూడెకరాలు సాగు చేసే రైతు సైతం ఇప్పటికే రూ.లక్షకుపైగా పెట్టుబడి పెట్టారు. ఏదైనా సమస్య వస్తే సర్వం కోల్పోయే పరిస్థితి ఏర్పడనుంది.

కౌలురైతుల్లో గుబులు

రెండు జిల్లాల్లో సాగైన నాలుగు లక్షల ఎకరాల్లో 80 శాతం కౌలు రైతులే చేస్తున్నారు. కౌలు కార్డుల జారీ, పంట రుణాల అందజేత అనేది ప్రహసనంగా మారిపోయింది. దీంతో కౌలురైతులకు పంటరుణాలు అందని ద్రాక్షగా మారాయి. దీంతో ప్రయివేటు వడ్డీ వ్యాపారుల నుంచి అత్యధిక వడ్డీలకు అప్పులు తెచ్చి వ్యవసాయ సాగు చేసిన పరిస్థితి ఉంది. పంట చివరి దశకు చేరిన సమయంలో వాతావరణంలో మార్పులు కౌలురైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కౌలు, పెట్టుబడులు పెరగడంతో వరిసాగులో మిగులు అనేది లేకుండాపోయింది. అయినప్పటికీ వ్యవసాయంపై మక్కువతో కౌలురైతులు అప్పులు చేసి మరీ సాగు చేస్తున్న పరిస్థితి ఉంది. ప్రకృతి వైపరీత్యాలకు పంటలు దెబ్బతిన్న కౌలురైతులకు నష్టపరిహారం అందడం లేదు. వెబ్‌ల్యాండ్ ఆధారంగా భూయజమానులకే పరిహారం ఇస్తున్న పరిస్థితి ఉది. బీమా పరిహారం సైతం కౌలురైతులకు ఇవ్వడం లేదు. దీంతో ఏదైనా విపత్తు వస్తే కౌలురైతులు రోడ్డున పడుతున్నారు. ఖరీఫ్ చివరిదశలో నెలకొన్న వాతావరణ మార్పులు రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఏర్పాట్లు జరుగుతున్న తరుణంలో అల్పపీడన ప్రభావం అధికారుల్లోనూ గుబులు రేపుతోంది. పంటంతా తడిస్తే కొనుగోలుకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడే ప్రమాదం ఉండటంతో అధికారుల్లోనూ చర్చ నడుస్తోంది.

డిప్యూటీ సిఎం X డిప్యూటీ స్పీకర్..!

కాకరేపుతున్న భీమవరం డిఎస్‌పి వివాదం

డిఎస్‌పి సెటిల్‌మెంట్లపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలన్న పవన్‌కల్యాణ్

సదరు పోలీస్ అధికారి ట్రాక్ రికార్డ్ అద్భుతమంటూ రఘురామకృష్ణరాజు కితాబు

జనాలు, పోలీసుల్లో తీవ్ర చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

భీమవరం డిఎస్‌పి జైసూర్యకు సంబంధించిన వివాదం రాజకీయాల్లో కాకరేపుతోంది. డిప్యూటీ సిఎం, వర్సెస్ డిప్యూటీ స్పీకర్ అన్నట్లుగా పరిస్థితి మారిందన్న చర్చ సాగుతోంది. భీమవరం డిఎస్‌పి జైసూర్య జూద క్రీడలకు కొమ్ముకాయడంతోపాటు సివిల్ తగాదాల్లో తలదూర్చి సెటిల్‌మెంట్లు చేస్తున్నారంటూ డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌కు కూటమి నేతలు ఫిర్యాదు చేశారు. దీనిపై డిప్యూటీ సిఎం మంగళవారం జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీకి ఫోన్‌చేసి డిఎస్‌పి వ్యవహార శైలిపై ఆరాతీయడం, విచారణ చేసి నివేదిక అందించాలని ఆదేశించడం సైతం జరిగింది. హోంమంత్రి, డిజిపి దృష్టికి సైతం డిప్యూటీ సిఎం కార్యాలయ అధికారులు తీసుకెళ్లారు. భీమవరం డిఎస్‌పి వ్యవహారంపై చంద్రబాబు సిఎం సైతం సీరియస్‌గా ఉన్నట్లు ప్రచారం సాగింది. దీంతో విచారణ చేసిన తర్వాత డిఎస్‌పిపై సస్పెన్షన్ వేటు ఖాయమన్న చర్చ సైతం నడిచింది. అనూహ్యంగా బుధవారం ఉండి ఎంఎల్‌ఎ, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు విశాఖపట్నంలో మాట్లాడుతూ భీమవరం డిఎస్‌పి ట్రాక్ రికార్డు అద్భుతం అన్నట్లు కితాబిచ్చారు. పవన్‌కళ్యాణ్‌కు ఎవరో తప్పుగా ఫిర్యాదు చేసినట్లు మాట్లాడారు. ఇది రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. భీమవరం, ఉండి నియోజకవర్గంలోనూ అత్యధికంగా పేకాట, కోడిపందాలు సాగుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. డిఎస్‌పి జైసూర్య జూద క్రీడలకు అండగా ఉంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వీటి నేపథ్యంలో పవన్‌కళ్యాణ్ వద్దకు సమస్య వెళ్లిందని చెబుతున్నారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అండతోనే డిఎస్‌పి జైసూర్య మరింత రెచ్చిపోతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆరునెలల కిందట డిఎస్‌పిని బదిలీచేయగా ఆయనను అక్కడే ఉండేటట్లు చేసింది రఘురామకృష్ణరాజే అన్న చర్చ సైతం నడుస్తోంది. ఈ కారణంగా డిఎస్‌పి జనసేన నేతలను ఏమాత్రమూ లెక్కచేయడం లేదన్న అభిప్రాయం ఆ పార్టీలో నెలకొంది. ఈ కారణంగానే డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ స్పందించినట్లు తెలుస్తోంది. ఇప్పుడు డిఎస్‌పి చాలా మంచోడంటూ డిప్యూటీ స్పీకర్ అనడంతో ఏం జరుగుతుందోనన్న చర్చ సాగుతోంది. డిప్యూటీ సిఎం, డిప్యూటీ స్పీకర్ అన్నట్లుగా వ్యవహారం మారిపోయిందంటూ రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది. డిఎస్‌పిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటారా..లేక పక్కకు పెట్టేస్తారా అన్న అభిప్రాయం జిల్లా ప్రజల్లో వ్యక్తమవుతోంది. ముందుముందు ఏంజరుగుతుందో వేచిచూడాల్సి ఉంది.

భీమవరం టౌన్: భీమవరం డిఎస్‌పి ఆర్.జైసూర్యపై డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ విచారణకు ఆదేశించడంపై బుధవారం ప్రజాశక్తి పత్రికలో సెటిల్మెంట్ కింగ్ ఆ డిఎస్‌పి శీర్షికన వచ్చిన కథనానికి విశేష స్పందన వచ్చింది. ఇటు రాజకీయ నాయకులతో పాటు, పోలీసుల్లోనూ పెద్దఎత్తున చర్చి జరిగిందని చెప్పొచ్చు, డిఎస్‌పి ఏ మేరకు సెటిల్‌మెంట్ చేశాడో ఎన్ని ఫిర్యాదులు సిఎం చంద్రబాబుకు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు అంది ఉంటే పవన్ నేరుగా జిల్లా ఎస్‌పికి ఫోన్ చేసి విచారణ చేయాలని ఆదేశాలిస్తారని అందరిలో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉండి, భీమవరం నియోజవర్గాల్లో పెద్ద మొత్తంలో క్లబ్‌లతో పాటు, అపార్ట్మెంట్ ప్లాట్లు, గ్రామాల్లో అనేక చోట్ల పేకాట ఆడడం, వాటికి అడ్డుకట్ట వేయడంలో పోలీసులు విఫలమయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ మేరకు పోలీసులకు ఆటకింత రేటు చొప్పున మామూళ్లు అందేవని, ముఖ్యంగా టౌన్ హాల్లో ఎక్కడా లేనివిధంగా రూ.5 లక్షలకుపైగా ఆడేవారిని పక్కనే డిఎస్‌పి కార్యాలయం ఉన్నా పట్టించుకోవడం కూడా పవన్ ఆగ్రహానికి కారణమని తెలుస్తోంది. ఇటీవల ఒక సివిల్ సెటిల్మెంట్లో డిఎస్‌పి పెద్ద మొత్తంలో ఆశించినట్లు దీంతో వివాదాన్ని సద్ది చెప్పకుండా తాత్సారం చేయడంపై పలువురు నేతలు డిఎస్‌పి వ్యవహారాన్ని పవన్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

డిప్యూటీ సిఎం ఆదేశాలతో విచారణ చేపట్టాం : ఎస్‌పి

డిప్యూటీ సిఎం ఆదేశాలతో విచారణ చేపట్టామని ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విచారణ చేపట్టమని త్వరలోనే ప్రభుత్వానికి డిఎస్‌పిపై నివేదిక ఇస్తామని తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ఎవ్వరినీ వదిలిపెట్టబోమని తెలిపారు. అలాగే పేకాట చట్ట వ్యతిరేక పనులు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి హెచ్చరించారు.

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ విరమించుకోవాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ - ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యాన సంతకాల సేకరణ

భీమవరం :సంతకాలు చేస్తున్న చోట నినాదాలు చేస్తున్న పరిరక్షణ కమిటీ నేతలు

తణుకు : సంతకాల సేకరణ చేస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి - భీమవరం

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను తక్షణం విరమించుకోవాలని, వైద్య రంగాన్ని వ్యాపారం చేయొద్దని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు. భీమవరం ప్రకాశం చౌక్ సెంటర్‌లో ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలు పిపిపికి అప్పగించడాన్ని రద్దు చేయాలని కోరుతూ బుధవారం సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున సంతకాలు చేసి ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రతి పక్షంలో ఉండగా ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. మెడికల్ కాలేజీలను తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వమే పూర్తిచేసి నిర్వహిస్తుందని చెప్పి అధికారంలోకి రాగానే ప్రయివేటు వ్యక్తులకు వైద్య విద్యను అందించడం అంటే ప్రజానీకాన్ని, రాష్ట్ర విద్యార్థులను మోసం చేసినట్లే అని విమర్శించారు. ఇప్పటికే విద్య, వైద్యం ఖరీదైపోయిందని, ఈ విధానాలు కొనసాగిస్తే పేద, మధ్య తరగతి ప్రజానీకం వైద్య విద్యకు, ఆరోగ్యానికి దూరమౌతారని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గాతల జేమ్స్ మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ విరమించుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం కేంద్రంలోని బిజెపితో కుమ్మక్కై ప్రభుత్వ సంస్థలన్నింటినీ ప్రయివేటీకరణ చేస్తోందన్నారు. పిపిపి అంటే ప్రజల ఆస్తిని ప్రయివేటు వ్యక్తులకు అప్పగించడమేనన్నారు. ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు గంట సుందర్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరణ చేయడం దారుణం అన్నారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు మాట్లాడుతూ వైద్య విద్యను ప్రయివేటీకరణ చేయడం ప్రజానీకాన్ని మోసగించడమే అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్ మాట్లాడుతూ వైద్య విద్యను పిపిపి పేరుతో ప్రయివేటీకరించడాన్ని విద్యార్థి సంఘం వ్యతిరేకిస్తోందన్నారు. దీనిపై ఇప్పటికే తమ వైఖరిని ప్రభుత్వానికి తెలిపామన్నారు. ఈ విధానాన్ని రద్దు చేయకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, సిఐటియు జిల్లా కారదర్శి మల్లిపూడి ఆంజనేయులు, నాయకులు ఇంజేటి శ్రీనివాస్, పట్టణ పౌర సమాఖ్య జిల్లా కన్వీనర్ ఎం.వైకుంఠరావు, రైతు సంఘం నాయకులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు, దేగల నాగు, ఎస్ఎఫ్ఐ నేతలు సాయికృష్ణ, సింధు, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

తణుకు : ప్రభుత్వ మెడికల్ కళాశాలలను (పిపిపి) విధానంలో ప్రయివేటీకరణ చేయాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి, పట్టణంలోని పలు కూడళ్లలో ప్రజాసంఘాలు, ప్రభుత్వ మెడికల్ కాలేజీల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే మెడికల్ కాలేజీలు ప్రతిభకు, సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తాయన్నారు. మెడికల్ కళాశాల ఉన్న ప్రాంతంలో పేదలకు ఉచిత వైద్యం అందుతుందన్నారు. అదే ప్రయివేటు యాజమాన్యాలైతే సంపన్నులకు మాత్రమే సీటు కేటాయిస్తారని, రిజర్వేషన్ ఉండదని అన్నారు. కూటమి ప్రభుత్వం పిపిపి విధానం తక్షణం ఉపసంహరించుకోవాలని సంతకాలు చేస్తున్న ప్రజలు కూడా చెప్పారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఎ.అజయ కుమారి, గార రంగారావు, పిఎల్ నర్సింహారావు, భాస్కరరావు, పి.రాజా పాల్గొన్నారు.

ఇరగవరం (తణుకు) : ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ నిలుపుదల చేయాలని ప్రజా సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. బుధవారం మెడికల్ కళాశాల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ప్రజాసంఘాలు సహకారంతో ఇరగవరం మండల కేంద్రంలో సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కామన మునిస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, దానికి 60 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్నా కేవలం రూ.6 వేల కోట్లు ఖర్చు చేసి కళాశాల అభివృద్ధి చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రయివేటు వ్యక్తులకు పి3 కింద జిఒ నెంబర్ 590 ద్వారా ఇవ్వడాన్ని వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. నేడు విశాఖపట్టణంలో గూగుల్ సంస్థకు 22 వేల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తున్నా రాష్ట్రంలోని మెడికల్ కళాశాలను పూర్తి చేయడానికి రూ.ఆరు వేల కోట్లు ఖర్చు చేయడం భారమని చెప్పడం బాధాకరమని మునిస్వామి అన్నారు. జిఒ 590ను రద్దు చేయాలని, గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన జిఒ నెంబర్ 107, 108ను కూడా రద్దు చేయాలని లేని పక్షంలో మెడికల్ కళాశాల పరి రక్షణ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిల్లి కోటేశ్వరరావు, ఎం.ముసలయ్య, జుత్తుగ రామాంజనేయులు, జక్కంశెట్టి గంగాధర్‌రావు పాల్గొన్నారు.

భీమవరంలో కలెక్టర్ ఆకస్మిక పర్యటన

ముంపునకు గురవుతున్న లోతట్టు ప్రాంతాల పరిశీలన

పార్కును పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

భీమవరంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి బుధవారం రాత్రి ఆకస్మికంగా పర్యటించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ముంపునకు గురువుతున్న లోతట్టు ప్రాంతాలను ఆకస్మికంగా పరిశీలించారు. వర్షాల కారణంగా రోడ్ల మార్జిన్‌లో, లోతట్టు ప్రాంతాల్లోని నీటిని మున్సిపల్ సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగిపోయేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అల్పపీడం దృష్ట్యా రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని, దీని దృష్టిలో ఉంచుకొని ఎక్కడా పారిశుధ్య లోపం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణంలో ఆక్రమణలను గుర్తించడంతోపాటు, రోడ్డు మార్జిన్లో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపట్టిన భవన యజమానులకు నోటీసులు జారీచేసి, తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సోమేశ్వర స్వామి దేవస్థానం ముందు పారిశుధ్య ఏర్పాట్లను పరిశీలించారు. కార్తీక మాసంలో దేవాలయ ప్రాంగణాలు అత్యంత పరిశుభ్రతగా ఉండేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బివి.రాజు పార్క్ ముందువైపున ఉన్న వివిధ రకాల తినబండారాల బండ్ల వద్ద పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. బివి.రాజు పార్కులో పెడలింగ్ బోట్లను శనివారం ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బుధవారం మార్కెట్ రైల్వే అండర్ పాస్ కు ఆనుకుని ఉన్న ప్రభుత్వ బిసి వెల్ఫేర్ కళాశాల బాలుర హాస్టల్‌ను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి, విద్యార్థులను మౌలిక వసతులపై ఆరా తీశారు. ఇబ్బందులు ఉన్నాయా, బాగా చదువుతున్నారా, ఏ యే కోర్సులు చేస్తున్నారు అంటూ పలకరించారు. తాగునీటికి ఇబ్బంది ఉందని, రన్నింగ్ వాటర్ శుభ్రంగా లేవని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే మున్సిపల్ అధికారులు పరిశీలించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, మున్సిపల్ ఇంజినీర్ టి.త్రినాధ రావు, ఎంహెచ్ఒ ఆర్.సోమశేఖర్, జిల్లా దేవాదాయ శాఖ అధికారి, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి ఎవి.సూరిబాబు, వసతి గృహ సంక్షేమ అధికారి కె.నాగ మోహన్‌రావు ఉన్నారు

ప్రజారోగ్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

మంత్రి నిమ్మల రామానాయుడు

జనరేటర్‌ను ప్రారంభించిన మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

ప్రతి వ్యక్తీ ఆరోగ్యంగా మెలగాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఆ ఉద్దేశంతోనే పాలకొల్లు పట్టణ వాసులకు తాగునీటి కష్టాలు తీర్చి సురక్షిత నీరు అందించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టినట్లు జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లు మున్సిపల్ వాటర్ వర్క్స్ వద్ద రూ.కోటీ 70 లక్షలతో పలు తాగునీటి సరఫరా అభివృద్ధి పనులను కూటమి నాయకులతో కలిసి బుధవారం మంత్రి ప్రారంభించారు. వాటిలో భాగంగా రూ.40 లక్షలతో జనరేటర్, మరో రూ.40 లక్షలతో వాటర్ పంప్ హౌస్, రూ.89.51 లక్షలతో ఏరియేటర్స్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ పట్టణ వాసులకు తాగునీటి కష్టాలతోపాటు సురక్షిత నీరు అందించేందుకు గత టిడిపి ప్రభుత్వంలో రూ.15 కోట్లతో 18, 25వ వార్డుల్లో రక్షిత నీటి సరఫరాకు ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణాలు, సంపు, ఫిల్టర్ బెడ్‌ల వంటి నిర్మాణాలు జరిగాయని తెలిపారు. దురదృష్టవశాత్తూ ప్రభుత్వం మారడంతో గత వైసిపి ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలోనే రూ.కోటీ 70 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని, వేసవిలో కరెంటు లేని సమయంలో తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా రూ.40 లక్షలతో 320 జనరేటర్ కొనుగోలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విజయ్ సారధి, మున్సిపల్ ఇంజినీర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించక పోయినా, ఉద్యోగులకు నెలకు రూ.164 కోట్లు వెచ్చించేలా చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. బుధవారం మంత్రి పట్టణంలో రూ.3.50 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఉద్యోగులకు ఒక డిఎను దీపావళి కానుకగా కూటమి ప్రభుత్వం ఇచ్చిందన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో డిఎ, పిఆర్‌సి బకాయిలు ఎగ్గొట్టి, జీతాలు ఇస్తే చాలు అనేలా ఉద్యోగులను వేధించారని విమర్శించారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన కాంట్రిబ్యూషన్ సొమ్మును కూడా జగన్ దోచుకున్నాడని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

జిల్లాలో పలుచోట్ల వర్షం

తాడేపల్లిగూడెంలో కురుస్తున్న వర్షం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

బుధవారం ఒక్కసారిగా ఉరుములు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పట్టణ, పరిసర ప్రాంతాల్లో పడింది. ఉదయం నుంచి మబ్బులు కమ్మినా వాతావరణం మధ్యాహ్నానికి ఒక్కసారిగా మారిపోయి సుమారు గంటసేపు భారీ వర్షం కురిసింది. ఆకస్మిక వాతావరణ మార్పుతో ప్రజలు ఆశ్చర్యానికి లోనయ్యారు. మధ్యాహ్న సమయం కావడంతో ఉద్యోగ విధులకు వెళ్లేవాళ్లు, విద్యార్థులు చిరు వ్యాపారులు ఇబ్బందులకు గురయ్యారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

మొగల్తూరు : మండలంలో బుధవారం తెల్లవారుజాము నుండి కురుస్తున్న వర్షంతో రహదారులు ఛిద్రమయ్యాయి. రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఉండడంతో ఆ గుంతల్లో వర్షపు నీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మండల కార్యాలయాలకు మొగల్తూరు, గొల్లగూడెం, మొగల్తూరు కోటమీదుగా వెళ్లే రహదారులు ఛిద్రం కావడంతో ప్రజలు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి వర్షం కురవడంతో వ్యాపారాలు వెలవెలబోయాయి.

గణపవరం: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావం వల్ల గణపవరంలో ఉదయం నుంచి మబ్బులు, చలిగాలులతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. సాయంత్రం అయిదు గంటలకు భారీ వర్షం పడింది. దీంతో ఈనిక దశలో ఉన్న వరిచేలకు తీవ్ర నష్టం కలిగే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆందోళన పడుతున్నారు. నవంబరు 20వ తేదీనాటికి కోతకు వచ్చే అవకాశం ఉందని, వర్షం, ఈదురుగాలుల వల్ల వరిచేలు పడిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు.

పెనుమంట్ర : బుధవారం ఎడతెరిపి లేని వర్షం కురవడంతో మండల ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఉదయం సత్యవరం గ్రామంలో ఎంఎల్‌ఎ పితాని పాల్గొన్న గ్రామ సభ కు ప్రజలు గొడుగులు వేసుకొని పాల్గొన్నారు. అలాగే ప్రధాన రహదారుల్లోని గోతుల్లో నీరు చేరి ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

పాలకొల్లు : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో పాలకొల్లులో ఎడతెరిపి లేని వర్షం పడింది. జనజీవనం స్తంభించింది. దీంతో ప్రజలు దేవాలయాలకు వెళ్లకుండా వర్షం ఇబ్బంది కలిగించింది.

మృతదేహంతో పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన

న్యాయం చేయాలని డిమాండ్

నిరసన తెలుపుతున్న మృతుని కుటుంబీకులు

ప్రజాశక్తి - ఆకివీడు

సుమారు నెల రోజుల క్రితం కనిపించకుండా పోయిన వ్యక్తి మృతదేహం లభించడంతో ఆ కుటుంబీకులు ఒక్కసారి ఖంగుతున్నారు. ఇది ఆత్మహత్య కాదని అతని మృతి పట్ల అనుమానాలు ఉన్నాయని, తమకు న్యాయం చేయాలంటూ బుధవారం పోలీస్ స్టేషన్ ముందు మృతుని కుటుంబీకులు నిరసన తెలిపారు. వివరాల్లోకి వెళితే స్థానిక పోలీస్ స్టేషన్‌లో గత నెల 19వ తేదీన చినకాపవరానికి చెందిన కొదామ మార్కరాజు (35) కనిపించడం లేదంటూ అతని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. మార్కరాజు చినకాపవరంలోని నిర్వహిస్తున్న తన బేకరీని రాత్రి 9 గంటలకు మూసివేసి స్నేహితులతో కలిసి బయటకెళ్లాడని, తిరిగి కనిపించలేదని 24వ తేదీ పోలీస్‌స్టేషన్లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే మార్కరాజు నెల రోజుల తరువాత అనగా ఈనెల 22వ తేదీ బుధవారం స్థానిక రైల్వేస్టేషన్ క్యాబిన్ రోడ్డు వద్ద పురుగుల మందు తాగినట్లు అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి తమకు ఫోన్ చేశాడని కుటుంబ సభ్యులు అంటున్నారు. వెంటనే అపస్మారక స్థితిలో ఉన్న మార్కరాజును ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లామని, మెరుగైన వైద్యం కోసం ఏలూరు తీసుకువెళ్లాలని డాక్టర్లు చెప్పారని, భీమవరం వర్మ హాస్పటల్‌కు తీసుకెళ్లామని, పరిస్థితి బాగోకపోవడంతో అక్కడ నుంచి విజయవాడ ఆస్పత్రి తీసుకు వెళ్తుండగా మార్గమధ్యంలో అతను మృతి చెందాడని తెలిపారు. మార్కరాజు మృతిపట్ల అనుమానాలు ఉన్నాయని, అతనికి ఎవరో కావాలని పురుగుల మందు తాగించారని తెలిపారు. విచారణ జరిపి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. సిఐ జగదీశ్వరరావు బంధువులకు సద్ది చెప్పి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు నిరసన విరమించారు. అనంతరం పోలీసులు మృతదేహాన్ని భీమవరం పోస్టుమార్టానికి పంపారు. ఎస్ఐ నాగరాజ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అరటిపండ్ల ధరలకు రెక్కలు..!

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో అరటిపండ్ల గెలలు

కార్తీకమాసం ప్రారంభంతో పండ్లు, అరటిపండ్ల ధరలకు రెక్కలు వచ్చాయి. ఒక పక్క వివాహ వేడుకలు జరగడం, మరోపక్క అయ్యప్ప భవాని స్వాముల ప్రత్యేక పూజల నేపథ్యంలో అరటి పళ్ల ధరలు 50 శాతం పెరిగాయని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. డజను రూ.30-40 ఉండే సాధారణ అరటిపండ్లు ధర 40-60కు పెరిగాయి. రూ.400-500 ఉండే అరటి గెల రూ.600-800కు పెరిగింది. కొబ్బరి కాయ ధర ఇప్పటికే పెరిగిన నేపథ్యంలో అరటిపండ్ల ధర కూడా సామాన్యులకు అందుబాటులో లేదు.

జాయింట్ ఎల్‌పిఎంలను పరిష్కరించాలి : జెసి

ప్రజాశక్తి - భీమవరం

పెండింగ్‌లో ఉన్న జాయింట్ ఎల్‌పిఎంలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి రీ సర్వే, హౌసింగ్ ఫర్ ఆల్, పిజిఆర్ఎస్ పిటీషన్ల పరిష్కారాలు అంశాలపై సంబంధిత అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో 3,800 జాయింట్ ఎల్‌పిఎంలు పెండింగ్ ఉండటంపై తహశీల్దార్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న జాయింట్ ఎల్‌పిఎంలకు శనివారం లోపుగా దరఖాస్తులు చేయించాలన్నారు. ప్రస్తుతం సబ్ డివిజన్లు అవసరం లేదని భూ యజమానులతో రాయించి దరఖాస్తులు తీసుకోవాలన్నారు. భారీ వర్షాల కారణంగా ప్రజలు, రైతులు, అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆర్‌డిఒలు కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, దాసిరాజు, ఎడి కె.జాషువా, జిల్లా పంచాయతీ అధికారి ఎం.రామ్ నాథ్ రెడ్డి, తహశీల్దార్లు, డివిజన్, మండల సర్వే అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపాధి అవకాశాలపై అవగాహన

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం డిగ్రీ కాలేజీలో బుధవారం విద్యార్థులకు ఉపాధి అవకాశాలపై పూర్వ విద్యార్థి సిహెచ్.రామాంజనేయులుతో అతిథి ఉపన్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ఫిజిక్స్ విద్యార్థులకు ఉపాధి అవకాశాలపై వివరించారు. అలాగే బిఎఆర్‌సి ఐఎస్ఆర్ఒ, డిఆర్‌డిఒ వంటి జాతీయ పరిశోధనా సంస్థల్లో ఉన్న అవకాశాలను వివరించారు. కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి మాట్లాడుతూ మండలంలోని జల్లికొమ్మర గ్రామానికి చెందిన సిహెచ్.రామాంజనేయులు గణపవరం ప్రభుత్వ కాలేజీ నుండి ఒక శాస్త్రవేత్తగా ఎదిగి ఈరోజు కాలేజీకి అతిథి ఉపన్యాసం ఇవ్వటానికి వచ్చిన రామాంజనేయులను అభినందించారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ లెక్చరర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పలుచోట్ల ప్రత్యేక ఆధార్ మొబైల్ క్యాంపులు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని 10 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఆధార్ మొబైల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 నుండి 7, 15 నుండి 17 సంవత్సరాలలోపు పిల్లలకు ఆధార్ అప్డేట్, నమోదుకు ఈ క్యాంపులు ఏర్పాటు చేశామన్నారు. నేటి నుండి ఈనెల 30వ తేదీ వరకూ ఈ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. మండలంలో గల పది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకునే విధంగా తల్లిదండ్రులు చూడాలని ఎంపిడిఒ సూచించారు.

ఉండి: మండల వ్యాప్తంగా ఎనిమిది రోజుల పాటు సాగే ఆధార్ ప్రత్యేక క్యాంపును ప్రతి ఒక్క చిన్నారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఉండి ఎంపిడిఒ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 23 నుంచి 30వ తేదీ వరకు ఆధార్ ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో ఐదు నుండి ఏడు సంవత్సరాల మధ్య వయసుగల పాఠశాల విద్యార్థులు, ఆధార్‌లో పొరపాట్లు నమోదైన వారు వెంటనే ఆధార్ కార్డులో సరి చేయించుకోవాల్సిందిగా ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో ఉండి, ఎన్ఆర్‌పి అగ్రహారం, యండగండి, మహదేవపట్నం తదితర గ్రామాల్లోని పలు పాఠశాలల్లో ఈ ఆధార్ ప్రత్యేక క్యాంపులను నిర్వహిస్తున్నామని సంబంధిత అధికారులు, విద్యార్థులకు, ప్రజలకు ఆధార్ లోటుపాట్లను గూర్చి అవగాహన కల్పించాలని ఆయన కోరారు.

జాతీయ స్థాయి పోటీల్లో ఎస్‌కెఎస్‌డి కళాశాల విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - తణుకు

ఎస్‌సిఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో(నోడల్ రిసోర్స్ సెంటర్) వారు ఆక్వా ఎంట్రప్రెన్యూర్‌షిప్‌పై జాతీయ స్థాయిలో పోటీలను ఈనెల 16, 17 తేదీల్లో నిర్వహించారని కళాశాల ప్రిన్సిపల్ యు.లక్ష్మీసుందరీబాయ్ తెలిపారు. ఈ పోటీలకు ఎందరో వ్యాపారవేత్తలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొనగా స్థానిక ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల యుజి, పిజి(అటానమస్) తణుకుకు చెందిన బి.షణ్ముఖేశ్వరి ప్రథమ బహుమతి సాధించిందని తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, అధ్యాపకులు అభినందించారు.

వెలుగు ఎపిఎం ప్రభుదాసు ఆకస్మిక మృతి

ప్రజాశక్తి - మొగల్తూరు


ప్రభుదాస్(ఫైల్ ఫొటో)

మొగల్తూరు మండల వెలుగు ఎపిఎం ఎం.ప్రభుదాసు మంగళవారం రాత్రి ఆకస్మికంగా మృతిచెందారు. ఈయన స్వగ్రామం నరసాపురం మండలం రుస్తుంబాద. ప్రభుదాసు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని వివిధ మండలాల్లో ఎపిఎంగా పనిచేసి అందరి మన్ననలను పొందారు. గత ఏడాది జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా మండలానికి ఎపిఎంగా వచ్చారు. ఈయన మృతికి వెలుగు సిబ్బంది, డ్వాక్రా మహిళలు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు సంతాపం వ్యక్తంచేశారు.

ఉద్యోగులు మరోసారి మోసపోయారు : యుటిఎఫ్

ఆకివీడు : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు మరోసారి మోసపోయారని, దీపావళి పండుగ పూట వంచనకు గురయ్యారని యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి, ఫ్యాప్టో నాయకులు ఆర్‌విఎస్.నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పండగ సందర్భంగా ప్రకటించిన డిఎ మోసపూరితంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన ఈ సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేశారు. ఐఆర్ ఊసే లేదని, పిఆర్‌సికి పంగనామాలు పెట్టారని పేర్కొన్నారు. 4 డిఎలకు గాను ఒక్క డిఎతోనే నిలువునా ముంచిన సర్కార్ 16 నెలలు ఎగ్గొట్టి ఆ తర్వాత చర్చల పేరుతో ఇంత హంగామా చేశారని పేర్కొన్నారు. ఫ్యాప్టో పిలుపుమేరకు యాప్‌ల బహిష్కరణ నిరంతరంగా కొనసాగుతుందని ఆయన తెలియజేశారు.

జిల్లా విజిలెన్స్ కమిటీ సమావేశం నిర్వహించాలి

యండగండి వినియోగదారుల సంఘం కార్యదర్శి పివిఎస్.గోపాలకృష్ణంరాజు

ఉండి : గత పది నెలల నుండి జిల్లా విజిలెన్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించకుండా జిల్లా కమిటీ ఛైర్మన్ చదలవాడ నాగరాణి, వైస్ ఛైర్మన్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి కాలయాపన చేయడం కమిటీ సభ్యులను అవమానించడమేనని యండగండి వినియోగదారుల సంఘం కార్యదర్శి పివిఎస్.గోపాలకృష్ణంరాజు బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రజారోగ్యం చెడగొట్టే నాణ్యతలేని కల్తీ ఆహార పదార్థాల విక్రయాలు, కల్తీ నీళ్ల అమ్మకాలు వంటి వాటిని అదుపు చేసేందుకు వినియోగదారుల సంఘం రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ అధికారి ఆగస్టు 28వ తేదీన జిల్లా కమిటీ సమావేశం వేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసినప్పటికీ జిల్లా అధికారులు కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 65 సంవత్సరాలు నిండిన వృద్ధులకు రేషన్ డోర్ డెలివరీ చేస్తామని చెప్పినప్పటికీ క్షేత్రస్థాయిలో జరగటం లేదని, జిల్లాలో ఎక్కడ చూసినా ఆహార పదార్థాలు కల్తీమయం అయిపోయాయని వీటన్నింటిపై చర్చించి ప్రజలకు న్యాయం చేసేందుకు వినియోగదారుల సంఘం సభ్యులు చూస్తుంటే.. అధికారులు వాటిపై ఆలోచించకపోవడం దారుణమన్నారు. వెంటనే సమావేశం వేయాలని పేర్కొన్నారు.

తండ్రిని కొట్టిన కొడుకుపై కేసు

నరసాపురం : తండ్రిని కొట్టిన కొడుకుపై బుధవారం కేసు నమోదు చేశామని పట్టణ ఎస్ఐ సిహెచ్.జయలక్ష్మి తెలిపారు. దీనికి సంబంధించి ఎస్ఐ తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని చలువపేటకు చెందిన పుచ్చకాయల నవీన్(35) మద్యం సేవించి తరచూ తల్లిదండ్రులపై దాడికి పాల్పడుతుంటాడు. ఈనెల 18న నవీన్ తన తండ్రి నరసింహారావుని రాయితో కొట్టడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నవీన్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ప్రభుత్వాస్తుల పరిరక్షణే ధ్యేయం

ఎంపిడిఒ కెఎన్.వైభవతి

ప్రజాశక్తి - వీరవాసరం

ప్రభుత్వ ఆస్తులను కాపాడటమే తన కర్తవ్యమని ఎంపిడిఒ కెఎన్.వైభవతి అన్నారు. ఇటీవల ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించిన ఆమెను ప్రజాశక్తి పలుకరించగా పలు విషయాలను ముచ్చటించారు.

ప్రశ్న : మీ ఉద్యోగ ప్రస్థానం ఎక్కడ నుండి ప్రారంభమైంది?

జవాబు : పంచాయితీ రాజ్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా మొగల్తూరులో ప్రారంభమైంది. ఆ తరువాత గ్రేడ్-2, గ్రేడ్-1 కార్యదర్శిగా ఉద్యోగోన్నతి పొందుతూ పంచాయతీ విస్తీర్ణ అధికారిగా పోడూరు మండలంలో పని చేస్తూ.. వీరవాసరం మండల ఎంపిడిఒగా రావడం జరిగింది.

ప్రశ్న : మీ ఉద్యోగ ప్రస్థానంలో ఎదురైన సవాళ్లు?

జవాబు : నాకు మాటలతో ఎదురైన సవాళ్లను చేతలతో చూపించి వారితోనే మన్ననలు పొందాను.

ప్రశ్న : మీ కర్తవ్యం ఏమిటి?

జవాబు : ఒక ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ ప్రభుత్వం మనకు అప్పచెప్పిన బాధ్యతలను నిబంధనలకు లోబడి పనిచేయాలి. ప్రభుత్వ ఆస్తులను కాపాడటమే నా కర్తవ్యం.. అందులో రాజీపడను.

చిట్ - చాట్

ప్రశ్న : ఈ స్థాయికి రావడంలో మీరు అవలంభించిన వైఖరి?

జవాబు : జవాబుదారీతనం, ప్రతీ ఒక్కరితో స్నేహంగా ఉండటం, పని పట్ల నిబద్ధత.

నిరుపేదలకు వైద్యం దూరం చేసేందుకు కుట్ర

మాజీ మంత్రి, వైసిపి నేత చెరుకువాడ శ్రీరంగనాథరాజు

ప్రజాశక్తి - పోడూరు

రాష్ట్రంలోని నిరుపేదలకు నాణ్యమైన వైద్యాన్ని దూరం చేసేందుకే కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరిస్తుందని మాజీ మంత్రి, వైసిపి నేత చెరుకువాడ శ్రీరంగనాథరాజు విమర్శించారు. మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ వైసిపి ఆధ్వర్యాన తలపెట్టిన కోటి సంతకాల కార్యక్రమానికి మండలంలోని తూర్పుపాలెం గ్రామంలో మాజీ మంత్రి, వైసిపి నేత శ్రీరంగనాథరాజు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణతో పేద విద్యార్థులకు వైద్య విద్య దూరమవుతుందని, పేదలకు వైద్య ఖర్చులు బాగా పెరిగిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి 17 మెడికల్ కాలేజీలను తీసుకువస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని ప్రయివేటీకరించేందుకు కుట్రలు చేస్తుందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రయివేటీకరణ ప్రతిపాదన విరమించుకోకపోతే వైసిపి తరపున పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పేద ప్రజలకు ఉచితంగా వైద్యం అందించాలనే లక్ష్యంతో ఆనాడు మహానేత డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకొస్తే కూటమి ప్రభుత్వం నేడు ఆ పథకాన్ని అనారోగ్యశ్రీగా మార్చేసి ప్రయివేటు ఆసుపత్రులకు బకాయిలు చెల్లించకుండా, పేదలకు వైద్యం దూరం చేస్తోందని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వానికి పేదల శ్రేయస్సు కంటే ఆ పార్టీ నాయకుల క్షేమమే ముఖ్యమని దుయ్యబట్టారు. మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ పేరుతో ప్రజలను ప్రయివేటు ఆసుపత్రులకు బలిచ్చే కార్యక్రమంను కూటమి ప్రభుత్వం వెంటనే ఆపాలని, విద్యా, వైద్యం రంగాలను ప్రయివేటు యాజమాన్యాల కిందకు తీసుకువెళ్లి పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడేందుకు కూటమి సర్కారు చేస్తున్న కుట్రలను ప్రజా పోరాటాలతో అడ్డుకుంటామని శ్రీరంగనాథరాజు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, గ్రామ కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోడూరులో సంతకాలు సేకరిస్తున్న శ్రీరంగనాథరాజు, వైసిపి నేతలు

ఆచంట : కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరించే కుట్రలు పన్నుతుందని దీనిని ప్రతిఒక్కరూ వ్యతిరేకించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మాజీమంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ మండలంలోని కరుగోరుమిల్లి గ్రామంలో కోటి సంతకాల సేకరణ, అనంతరం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కరుగోరుమిల్లి గ్రామంలో అనూహ్యంగా ప్రజలు వైసిపికి మద్దతు పలుకుతున్నారన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వైఎస్.జగన్ పనిచేస్తే, టిడిపి ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు ప్రజావ్యతిరేకంగా వ్యవహరించి ప్రజల ద్రోహిగా చరిత్రలో నిలిచారని విమర్శించారు. కరుగోరుమిల్లిలో అక్రమంగా ఇసుక రవాణా చేసి స్థానిక టిడిపి నాయకులు ధనార్జన చేశారని ఆరోపించారు. రాబోయే రోజుల్లో గడప గడపకూ ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ జక్కంశెట్టి చంటి, నాయకులు సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావు, పిల్లి రుద్రప్రసాద్, బోడపాటి బుల్లియ్య, జక్కంశెట్టి శ్రీరామ్, గ్రామ కమిటీ అధ్యక్షులు ముత్యాల అమ్మన్నాయుడు, ముప్పాల వెంకటేశ్వరరావు, ఏనుములంక మాధవి, యడ్ల రామకృష్ణ, కొంబొత్తుల దుర్గ ప్రసాద్, సూర్య నారాయణ పాల్గొన్నారు.

భారీ వర్షాలతో రోడ్లకు తూట్లు

ప్రజాశక్తి - ఆచంట

గోతులమయమైన రహదారి

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు రహదారులు తూట్లు పడ్డాయి. మండలంలోని ప్రధాన రహదారులన్నీ గోతులు మయంగా మారి వర్షం నీటితో నిండిపోయాయి. దీంతో గోతులు పరిస్థితి తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అసలే అధ్వానంగా ఉన్న మండలంలోని వివిధ రహదారులు గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తూట్లు పడ్డాయి. ప్రధానంగా ఆచంట - వేమవరం, ఆచంట కోడేరు, కొడమంచిలి, వయా కరుగోరుమిల్లి, వల్లూరు రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆచంట పాలకొల్లు ఆర్‌అండ్‌బి రహదారి నుంచి పెనుమంచిలి వర్ధనపు గురువు మీదుగా కరుగోరుమిల్లి వెళ్లే రహదారి పలుచోట్ల దెబ్బతింది. ప్రధాన రహదారుల పరిస్థితి ఈ విధంగా ఉంటే వివిధ గ్రామాలకు కలిపే లింక్ రోడ్ల పరిస్థితి మరింత దిగజారింది. ప్రభుత్వం స్పందించి తూట్లు పడిన రహదారులను మరమ్మత్తులు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

దాతల సహకారంతో అన్నదానం

వడ్డించిన మంత్రి రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

అన్నం వడ్డిస్తున్న మంత్రి నిమ్మల

పంచారామ క్షేత్రమైన పాలకొల్లులోని క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా నెల రోజులపాటు దాతల సహకారంతో నిర్వహించే ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ప్రారంభించారు. ఆలయానికి వచ్చిన భక్తులు, యాత్రికులకు వడ్డించారు. ముందుగా అమ్మవారికి పూజా కార్యక్రమం జరిపారు. ఆలయ పాలకవర్గం ఆధ్వర్యాన రేపాక వారి సత్రంలో జరిగే ఈ కార్యక్రమంలో కూటమి నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ భారతదేశంలోని పంచారామ క్షేత్రాల్లో ఒకటైన పాలకొల్లులోని క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయానికి కార్తీకమాసం రోజుల్లో స్వామివారిని దర్శించుకునేందుకు లక్షలాది మంది భక్తులు, జిల్లా, రాష్ట్రాల నుంచి యాత్రికులు వస్తారని తెలిపారు. వీరికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు నెలరోజుల పాటు దాతల సహకారంతో రుచికరమైన వేడిగా ఉండే వంటలతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలకు ప్రభుత్వం తరఫున అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకవర్గ ఛైర్మన్ మీసాల రాము, ఇఒ ముచ్చర్ల శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య ఎపి మహిళా విభాగం అధ్యక్షురాలుగా కొత్త కనకరత్నమాల

ప్రజాశక్తి - ఆచంట

భీమలాపురం గ్రా మానికి చెందిన శ్రీదేవి ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ కొత్త కనకరత్నమాల ఆర్యవైశ్య ఎపి మహిళా విభాగం(సీనియర్ సిటిజన్) అధ్యక్షురాలుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గతంలో చేసిన వివిధ సేవా కార్యక్రమాలకు గాను ప్రభుత్వం నుంచి పలు ప్రశంసా పత్రాలు, అవార్డులు అందుకున్నట్లు తెలిపారు. గత 42 సంవత్సరాలుగా అనేక పదవులతోపాటు సేవా కార్యక్రమాలు చేసినందుకు గాను గ్రామస్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి దాకా అనేక అవార్డులు వచ్చాయన్నారు. ఇటీవలే రెండు గౌరవ డాక్టరేట్లతో పాటు బుక్ ఆఫ్ రికార్డు, స్వర్ణ నంది అవార్డులు అందుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా భీమలాపురం శ్రీదేవి ఆర్యవైశ్య మహిళా మండలి ద్వారా పలువురు మహిళలకు ఉపాధి అవకాశాలను ప్రభుత్వం నుంచి కల్పించామన్నారు. ఆర్యవైశ్య ఎపి మహిళ విభాగం అధ్యక్షురాలుగా నియమితులైన సందర్భంగా పలువురు అభినందించారు.

కాలవగట్టు రోడ్డు త్వరలో పూర్తి

ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని సత్యవరం గ్రామం నుండి పెనుగొండ కాలేజీ వైపు వెళ్లే కాలువ గట్టు రోడ్డును పూర్తిస్థాయిలో శాశ్వతంగా అభివృద్ధి చేస్తామని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ ప్రకటించారు. బుధవారం మండలంలోని సత్యవరంలో 'పల్లె పల్లెకు పితాని' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. గ్రామ ప్రజలతో, అధికారులతో కలిసి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం కుల, మత, ప్రాంత, పార్టీ భేదాలు లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా పని చేస్తుందని పితాని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక లోటు ఉన్నప్పటికీ ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్, అన్నదాత సుఖీభవ, ఆటో సోదరులకు సంవత్సరానికి రూ.15 వేలు, పింఛన్ రెట్టింపు వంటి హామీలను అమలు చేస్తోందని చెప్పారు. విద్యాభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. గ్రామంలోని తాగునీటి సమస్య త్వరితగతిన పరిష్కరించేందుకు, అలాగే కొత్త పైపులైన్లు వేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. సత్యవరం గ్రామంలో లోఓల్టేజీ సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఎల్‌బి చర్ల గ్రామ సచివాలయం సందర్శన

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని ఎల్‌బి చర్ల గ్రామ సచివాలయంను బుధవారం ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయం సిబ్బందితో సమీక్ష నిర్వహించి, వివిధ శాఖల కార్యకలాపాలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాల అమలు, సేవల పంపిణీ, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలపై అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. నాయకర్ మాట్లాడుతూ సచివాలయాలు ప్రజలకు ప్రభుత్వం అందించే సేవల ముఖ్య కేంద్రమని, ప్రతి ఉద్యోగి ప్రజల సమస్యలను సమయానుసారం పరిష్కరించేలా కృషిచేయాలని సూచించారు. ప్రజలతో మరింత సమీపంగా ఉండి, పారదర్శకంగా సేవలు అందించాలని ఆయన ఉద్యోగులను కోరారు. ఈ కార్యక్రమంలో గుబ్బల మార్రాజు, కటకంశెట్టి సంజీవ్ రావు, సుధాకర్, వెన్న నరేష్ పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఎంపిపి దుర్గా భవాని

ప్రజాశక్తి - వీరవాసరం

భవిష్యత్‌లో తాగునీటికి ఇబ్బంది లేకుండా అమలు చేయబోతున్న జలజీవన్ మిషన్‌ను సద్వినియోగం చేసుకోవలసిన అవసరం ఉందని ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని చంద్రశేఖర్ అన్నారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా గోదావరి నది నుండి పైపులైన్‌ల ద్వారా నేరుగా తాగునీరు గ్రామాలకు అందించేందుకు కొవ్వూరు మండలంలో ముద్దూరు వద్ద ఏర్పాటు చేసే వాటర్ గ్రిడ్ పథకాన్ని గ్రామాలకు అనుసందానించవలసి ఉందన్నారు. ఇందుకు మండలంలో నాలుగు గ్రామాలలో ఓవర్ హెడ్ బాలన్స్ రిజర్వాయర్‌లు(ఒహెచ్‌బిఆర్) నిర్మించాల్సిన అవసరం ఉందని, వీటిని నిర్మించేందుకు అనువైన స్థలాలను సేకరించాల్సి ఉందన్నారు. దీనిపై బుధవారం ఎంపిడిఒ వైభవతి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ కనకారావులతో ఎంపిపి సమీక్షించారు. వీరవాసరం, చింతలకోటిగరువు, మత్స్యపురి, అండలూరులలో అనువైన గ్రామాలుగా గుర్తించారు. ఈ గ్రామాలలో ఒహెచ్‌బిఆర్‌లను నిర్మిస్తే మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలకు సమానంగా తాగునీరు సరఫరాకు అవకాశం ఉంటుందని ఎఇ కనకారావు తెలిపారు. ప్రస్తుతం నిర్దేశించిన నిబంధనల ప్రకారం పంచాయితీల ద్వారా ఒక మనిషికి రోజుకు యాభై లీటర్లు చొప్పున తాగునీరు అందించడం జరుగుతుందని, వాటర్ గ్రిడ్ వినియోగంలోకి వస్తే మరో యాభై లీటర్లు అదనంగా అందుబాటులోకి వస్తుందన్నారు. దీంతో చాలాకాలం వరకు తాగునీటికి ఇబ్బంది ఉండదని ఎఇ వివరించారు. ఒహెచ్‌బిఆర్‌ల నిర్మాణాలకు అవసరమైన స్థలాలను సమకూర్చడంలో ప్రజా ప్రతినిధులు సహ కరించాలని కోరారు. ఈ సమీక్షలో చింతలకోటి గరువు ఉపసర్పంచి దాసరి మాణిక్యం, వీరవల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీకి నిధులు విడుదల చేయాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

పేద ప్రజల ఆరోగ్య సంజీవని ఆరోగ్యశ్రీ పథకం అని, కీర్తిశేషులు డాక్టర్ వైఎస్ఆర్ ప్రవేశపెట్టిన గొప్ప పథకం ఆరోగ్యశ్రీ అని పిసిసి సభ్యులు కొరగంజల హరికిరణ్ చెప్పారు. ఇలాంటి ప్రతిష్టాత్మక పథకానికి నిధులు ఇవ్వకుండా, రూ.2,700 కోట్ల బకాయిలు పెట్టి, పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తూ చంద్రబాబు రాక్షసుడు అవుతున్నారని మండిపడ్డారు. బుధవారం ఆయన పాలకొల్లులో మీడియాతో మాట్లాడారు. ఆరోగ్యశ్రీ బకాయిలను వెంటనే చెల్లించి ప్రయివేట్ ఆసుపత్రుల్లో తిరిగి వైద్య సేవలను అందించాలని, ఆరోగ్య శ్రీ పథకాన్ని రద్దు చేసే కుట్రపూరిత ఆలోచనను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్ వద్ద 'స్ట్రెచర్‌పై ఆరోగ్యశ్రీ' పేరుతో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

విజయవాడలో నిర్వహించిన ఆందోళనలో హరికిరణ్

యువజనోత్సవాల్లో విద్యార్థినుల సత్తా

ప్రజాశక్తి - తణుకు

బహుమతులు అందుకున్న విద్యార్థులు

యువజన సర్వీసుల శాఖ, సెట్‌వెల్ ఆధ్వర్యాన నిర్వహించిన జిల్లా యువజనోత్సవాల్లో తణుకు ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల ఇంటర్ విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ భూపతిరాజు హిమబిందు తెలియజేశారు. ఈనెల 17వ తేదిన తణుకు ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల ఆవరణలో నిర్వహించిన యువజనోత్సవాల్లో వెస్ట్రన్‌గ్రూప్ డ్యాన్స్‌లో పి.నందిని, కె.స్నేహ, డి.వర్షిణి, ఆర్.వర్ష, ఎస్.భారతి, డి.అమూల్య, ఎం.ఐశ్వర్య పాల్గొని ప్రథమ స్థానాన్ని సాధించారని తెలిపారు. ఫోక్ డ్యాన్స్ సోలోలో ఎ.శ్రావణి ద్వితీయ స్థానాన్ని, కూచిపూడి క్లాసికల్‌లో యు.యామిని తృతీయ స్థానాన్ని, వక్తృత్వంలో డి.తేజ తృతీయ స్థానాన్ని సాధించి బహుమతులు అందుకున్నారన్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి ప్రత్యేకంగా అభినందించారు. నిర్వాహకులు ఎస్.గృహలక్ష్మీ, ఆర్.సుధారాణి, టి.లక్ష్మీకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మారం వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. మూడు సంవత్సరాల కాలం పరిమితి కలిగిన ఈ కమిటీలో 2025 నుండి 2028 వరకు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కొనసాగుతారని కమిటీ సభ్యులు తెలియజేశారు. అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ సలహా బోర్డు ఛైర్మన్ గంజి రాజమౌళి గుప్త, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్త, రాష్ట్ర అధ్యక్షులు కోన శ్రీనివాసరావు నియామక పత్రాలను జారీ చేసినట్లు కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికైన మారం వెంకటేశ్వరరావుకు జిల్లా ఆర్యవైశ్య ప్రముఖులు, తాడేపల్లిగూడెం శ్రీఆర్యవైశ్య సంఘం ప్రముఖులు అభినందనలు తెలియజేశారు.

9న కార్తీక వన సమారాధన

ప్రజాశక్తి - మొగల్తూరు

అగ్నికుల క్షత్రియ కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న మామిడి తోటలో వచ్చే నెల 9వ తేదీ ఆదివారం నిర్వహించనున్నామని మత్స్య సహకార సంఘాల జిల్లా అధ్యక్షుడు మహిళా వసంతరావు, పల్లవసేన అధ్యక్షుడు కొల్లాటి బాబురావు అన్నారు. ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆ సంఘ నాయకుడు నాగిడి రాంబాబు అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గోడ పత్రికని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ తొలిసారిగా అగ్నికుల క్షత్రియ సామాజిక వర్గం ఆధ్వర్యాన ముత్యాలపల్లి లో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ వన సమారాధనకు సంఘ సభ్యులందరూ సకుటుంబ సమేతంగా ఉదయం 9 గంటలకు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బర్రె నాగరాజు, బొడ్డు కృష్ణభగవాన్, తిరుమణి స్వామి, నాగిడి భగవాన్, బాలకృష్ణ, చెన్నకేశవులు, కోపనాతి శ్రీనివాసు, కొల్లాటి రామారావు, పొన్నమండ వడ్డీ కాసులు, మోకా ఏడుకొండలు, కొల్లాటి రామారావు, వాటాల కృష్ణమూర్తి, కొల్లాటి భోగరాజు, తిరుమణి వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

వేతనాలు, పిఎఫ్ బకాయిలు చెల్లించాలి

కొనసాగిన పారిశుధ్య కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - తణుకు

తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలోని కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు తమ మూడు నెలల వేతన బకాయిలు చెల్లించాలని, 41 నెలల పిఎఫ్ బాకాయి సొమ్ము కార్మికుల పిఎఫ్ ఖాతాల్లో జమ చేయాలని, తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి 150 పడకల స్థాయి కనుగుణంగా కనీసం మరో 50 మంది పారిశుధ్య కార్మికులను నియమించాలని కోరుతూ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు, తణుకు ప్రభుత్వ ఆసుపత్రి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కోనాల భీమారావు మాట్లాడుతూ కార్మికులకు ఇస్తున్న వేతనాలే అతి తక్కువ వేతనాలని అవి కూడా సకాలంలో ఏనెలకానెల ఇవ్వకపోవడంతో కార్మికులు పస్తులతో విధులు నిర్వహిస్తున్నారన్నారు. మూడు నెలల వేతనాలు, 41 నెలలుగా పిఎఫ్ చెల్లించవలసి వుందన్నారు. సమ్మెకు ఎపి మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ధర్మాని పుష్పలత, ఎం.బేబి, భారతి, ఎన్.వెంకటలక్ష్మి, డి.ప్రసన్నకుమారి, ఎలిపే హైమావతి, డి.శ్రీనివాస్, ఎన్.చింతాలు, సిహెచ్ డి.రాజశేఖర్, పి.రామారావు, జి.బాలసాయి, సిహెచ్.మంగమ్మ, పి.విజయలక్ష్మి, పంపన రేణుక, వి.సూరమ్మ, దేవబరికిన చిన్నా, డి.లక్ష్మణరావు, నేకూరి లక్ష్మి, యు.లక్ష్మి, దంబూరు పాల్గొన్నారు.

బహిరంగ వేలం ప్రకటన

మహారాజశ్రీ ప॥గో॥జిల్లా, ఏలూరు మొదటి అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

E.P.No. 192/2025 (Old E.P.No. 113/2024 in O.S.No. 45/2019

Between:

చిలుకల ధనలక్ష్మి దేవి ...డిక్రీహోల్డర్

మరియు

యర్లపాటి ఇస్సాక్ నిర్మలబాబు ...జడ్జిమెంట్ డెటార్

పై నెంబరు దాఖలా వారంటు గ్రంధములో డిక్రీ బాకీ వసూలు నిమిత్తం ఈ దిగువ ఇ.పి. షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పై కోర్టు వారు ది. 13-11-2025 సం॥ తేది ఉదయం గం. 10-30 ని.లకు బహిరంగంగా వేలం వేయుదురు. కావలసిన వారు సదరు వేలంలో పాల్గొని పాడుకొనవచ్చును. వాది/డిక్రి హోల్డర్ తరపు దాఖలు చేసిన ఇ.పి. షెడ్యూలు దాఖలా ఆస్థి వివరము.

పశ్చిమగోదావరి జిల్లా (ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా) అనంతపల్లి సబ్ రిజిస్ట్రార్ వారి ఇలాఖా, నల్లజర్ల మండలం, దూబచర్ల గ్రామ పంచాయితీలో ఆర్.యస్.నెం. 639/3B లో దక్షిణం వైపు ఉన్న య. 3-17 సెంట్లులో య. 1.58 సెంట్లు RCC బిల్డింగ్‌తో కలిపి జడ్జిమెంట్ డెటరు సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములో ఉండి ఈ డిక్రీ బాకీ క్రింద జప్తు చార్జి కాబడి వేలం కావలిసియున్న ఆస్తికి హద్దులు:

తూర్పు - Land of Mullapudi Hari Chandra Rao
దక్షిణం - Land of Cherukuri Avatharam and others
పడమర - Devulapalli Road
ఉత్తరం - Land of Ghanta Ankalu and others

అమీనా కిమ్మత్తు : Rs. 35,00,000/-
డిక్రీహోల్డర్ కిమ్మత్తు : Rs. 50,00,000/-

ఇబ్రహీం షరీఫ్
అడ్వకేట్, ఏలూరు
సెల్: 92900 49530

ఏలూరు
ది.22-10-2025

శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం

కాళ్ళకూరు గ్రామం, కాళ్ళ మండలం, ప.గో.జిల్లా, ఫోన్: 08816-245341, సెల్: 8985244445

షార్ట్ సీల్డు కొటేషన్ ప్రకటన

ఆర్.సి.సంఖ్య : నిల్ /2025 తేది : 22-10-2025

శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం, కాళ్ళకూరు వార్కి ఈ క్రింది తెల్పిన ఐటమ్స్‌నకు సీల్డు టెండర్ ద్వారా కోరబడుచున్నవి.

వ. నెం.	వివరములు	స్వభావం	కాలపరిమితి	కొటేషన్ దాఖలు చేయుటకు ఆఖరు తేదీ సమయం
1.	తెపోత్సవము సందర్భముగా పద్మావతి కోనేరు వద్ద విద్యుత్ మెరుపులు ప్రదర్శన (లేజర్ షో)	సీల్డు కొటేషన్	ది.02-11-2025 తేదీ రాత్రి గం.7.00 లకు విద్యుత్ మెరుపులు ప్రదర్శన	31-10-2025 ఉదయం 10.30 గంటలకు
2	తెపోత్సవము సందర్భముగా పద్మావతి కోనేరు చుట్టు విద్యుత్ అలంకరణ మరియు 20 కే.వి జనరేటర్ ఏర్పాటు	సీల్డు కొటేషన్	ది.07-11-2025 తేదీ విద్యుత్ అలంకరణ	31-10-2025 ఉదయం 10.30 గంటలకు
3	తెపోత్సవము సందర్భముగా కోనేరు నందు ప్లాస్టిక్ డ్రమ్స్‌తో హంస అలంకరణతో తెప్ప ఏర్పాటు చేయుట	సీల్డు కొటేషన్	ది.02-11-2025 తేదీ హంస అలంకరణతో తెప్ప	31-10-2025 ఉదయం 10.30 గంటలకు

ఇతర వివరములకు దేవాలయ కార్యాలయం పని వేళల యందు సంప్రదించగలరు.

కాళ్ళకూరు, ది.22.10.2025 కార్యనిర్వహణాధికారి